("దసరా మామూళ్ళ" బాధ పడలేక ఇంట్లోంచి పారిపోయిన ఒకానొక భర్త గురించి భార్య ఇచ్చిన పేపరు ప్రకటన)

ప్రియమైన శ్రీవారికి

ఆరోజు నా జీవితంలో మరుపురాని రోజు. పండుగ ఇంకా పది రోజులుండదగా, చెంబు పట్టుకుని, బారెడు చుట్ట నోట్లో పెట్టుకుని, "ఒసేవ్! తలుపేసుకో! అలా గోస్తే నది వైపు వెళ్ళొస్తా!" అని రోజూ లాగానే వెళ్ళారు. అంతే! మళ్ళీ మీరు కంటికి కనబడలేదు.

మీరు చెప్పిన నాటి నుండీ మేం వీధి తలుపు తీస్తే ఒట్టు! దసరా మామూలు వాళ్ళు వూరు కుంటారా? దొడ్డి దోవన వచ్చి మీ గురించి ఆరా తీశారు.

మన వీధిలో వాళ్ళెవరూ వీధి తలుపులు తీసి మసలడం లేదు. ఆడవాళ్ళం ఇండ్ల లోంచి బయటకి రావడం మానుకున్నాం. మగవాళ్ళు మాత్రం మారువేషాలలో ఆఫీసులకు గ్రటా వెళ్తున్నారు.

ఈ విచిత్రం విన్నారా? మన కరటక శాస్త్రులు లేడూ? అతగాడు మారువేషం వేసుకోవడం మరిచి వీథిలోకి వెళ్ళాడుట ఎవరో బారసాల ముహూర్తం పెట్టమంటే! అతగాడు అలాగ నాలుగడుగులు వేశాడో లేదో దసరా మామూలు వాళ్ళు పట్టే శారుట.

అప్పుడు అతను తెలివిగా "నేను కరటక శాస్త్రులు తమ్ముణ్ణి. పేరు బూరిశాస్త్రులు అన్నాట్ట! పైగా మేమిద్దరం కవలలం! మాది తెనాలి. చుట్టపు చూపుగా వచ్చాను!" అని బొంకాడుట!

అయితే వాళ్ళు మాత్రం వూరుకుంటారా? అయితే తెనాలిలో అయినా మీరు దసరా మామూలు ఇచ్చారా? అని నిలేశారుట.

"నిక్షేపంలా ఇచ్చి వచ్చాను!" అని శాస్త్రుల్లు అన్నాట్ట. వాళ్ళేం తెలివి తక్కువవాళ్ళు? అంచేత, "అయితే మీరు మాకు తెనాలిలో 'దసరా మామూళ్ళ' వసూళ్ళ సంఘం వారిచ్చిన పత్రం చూపించండి!" అన్నారుట.

ఏమాట కామాటే చెప్పుకోవాలి సుమండీ! అలాగ మీకు జరిగితే తెల్లమొగం వేసేవారు. కరటక శాస్త్రుల్లు గట్టి పిండం కనుక, ఆ సమయానికి




డాక్టరుగారు రాసిచ్చిన మందుల చీటీ బొడ్లో వున్న విషయం జ్ఞాపకం వచ్చి దాన్ని ఒరలోంచి కత్తిని తీసినట్టు తీశాట్ట.

వెంటనే ఆ దసరా మామూలు వాళ్ళు డంగయి పోయి "క్షమించండి! మీరు బూరి శాస్త్రులు గారే! వెళ్ళండి అన్నారుట ఆ చీటీ చూడకుండానే!

అందుకే సమయస్ఫూర్తి వుండాలి దేనికయినా! అంతేగాని ఇలాగ భయపడి వూరొదిలి పారిపోతారా ఎవరయినా? ఇంట్లో ఆడది ఖంగారు పడదూ? ఇల్లొదిలి పోతే పోయారు విల్లయినా రాసిపోయారా? విల్లయిసీ, గ్రాట్యుయిటీ నామినీ పేరు నా పేరే వ్రాశారా? లేక ఏ బుచ్చమ్మ పేరో, మధురవాణి పేరో పెట్టేశారా?

అనుమానం పెనుభూతం అన్నారు. ఏ దసరా మామూలు వాళ్ళు ఏ క్షణాన వచ్చి ఇంటి మీద పడతారో అన్న భయంతో ప్రాణాలు బీరువా లోనూ, పోపుల డబ్బాలోనూ పెట్టుకుని కాలక్షేపం చేస్తున్నాను.

నా చేతి వంట కాలకూట విషంలా వుంటుం దంటూనే భయం లేకుండా ధైర్యంగా తినేసేవారు. రష్యన్ మిస్సైల్ లాంటి అప్పడాల క్రరకు మీ బుర్ర ఏనాడూ చెక్కు చెదర్లేదు. యమకింకరుడు వంటి పాలవాడి ఖాతాకు, శాకినీ, ఢాకినీ వంటి కూరగాయలు అమ్మే అప్పల నరసమ్మ పెరుగు తోటకూర ఖాతాకు, సిసింద్రీ చిట్టిబాంబు లాంటి కిళ్ళీ కొట్టు ఖాతాకు, బాంబుల బసవయ్య బియ్యం కొట్టు ఖాతాకు దడవని మీరు "దసరా మామూళ్ళకు" దడుస్తున్నారంటే, అర్థాంగిగా మీ బాధని, భయాన్ని అర్థం చేసుకోలేనంత మూఋరాలిని కాదు! నమ్మండి! మీ తోడు!

కాబట్టి మీరు ఎక్కడున్నా, వెంటనే ఇంటికి వచ్చేయండి. నగా, నట్రా, భూమి, పుట్రా, చెంబూ, తప్పేళా, ఇల్లూ, వాకిలీ, నుయ్యి, గొయ్యి, తాకట్టు పెట్టి అయినా ఈ దసరా మామూలు వాళ్ళని వదిలించుకుందాం! ఆశతో ఎదురు చూస్తూ!!

ఇట్లు

మీ

చరణదాసి సుబ్బులు

## టి.వి. కొరాప్టన్ స్ప్రీట్

గోరుముద్దల రాజావారు

